అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36 (ఆదివారం)
కనిష్ఠం : 29



సూపర్.. 6



కూటమిలో పదవుల పండగ

- ఉమ్మడి జిల్లాకు ఒకేసారి ఆరు పదవులు
- నామినేటెడ్ పదవుల పంపకం
- రాష్ట్రస్థాయి చైర్మన్లుగా నలుగురు
- డీసీసీబీ, డీసీఎంఎస్‌కు ఇద్దరు
- ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ
- ఫలించిన ఎదురుచూపులు
- టీడీపీకి 3, జనసేనకు 2, బీజేపీకి 1

ఎదురుచూపులు ఫలించాయి..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరుగురు నాయకులను నామినేటెడ్ పదవులు వరించాయి. దీంతో ఇప్పటి వరకూ నామినేటెడ్ పదవులపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కేఎస్ జవహర్ నియమితులయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును వరించింది. రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ చైర్మన్ పదవి మండపేటకు చెందిన జనసేన నాయకుడు వేగుళ్ల లీలాకృష్ణను వరించింది. ఇక రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవికి రంపచోడవరానికి చెందిన చోళ్ల బొజ్జిరెడ్డి (బీజేపీ) నియమితులయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరి ంచింది. తుమ్మల బాబు ప్రస్తుతం కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఉన్నారు. తాజా పదవితో తుమ్మలకు మూడు పదవులు వరించినట్లయింది.అటు డీసీఎంఎస్ చైర్మన్‌గా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెచ్చెట్టి చంద్రమౌళికి కేటాయించారు. ఒకేసారి ఆరు పదవులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించడంతో సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కేఎస్ జవహర్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్ అనూహ్యంగా 2014లో కొవ్వూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014 నుంచి 2019 వరకు కొవ్వూరు ఎమ్మెల్యేగా, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేశారు.తదనంతర పరిణామాలతో కొవ్వూరు నుంచి తిరువూరు వెళ్లా రు.2019లో తిరువూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించినా దక్క లేదు.దీంతో పోటీకి దూరంగా ఉన్నారు. ప్రసుత్తం తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జవహర్ తనయుడు కొత్తపల్లి లాల్ టీడీపీ యువజన విభాగం కార్యదర్శిగా,రాజానగరం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు.ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

సమసమాజ స్థాపనకు కృషి

సామాజిక న్యాయం అందించడానికి.. సమసమాజ స్థాపనకు కృషి చేస్తా. పీ4 విధానంలో దళితుల అభివృద్ధికి సాధ్యమవుతుందని ఆశిస్తున్నా. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు.

- జవహర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా పదవి లభించింది. ప్రభుత్వం ఆదివారం వివిధ కార్పొరేషన్లకు ప్రకటించిన పదవుల్లో శేషారావుకు ఈ పదవి దక్కింది. ఈయన 1965వ సంవత్సరం జూలై 15న వేలివెన్నులో జన్మించారు. బీఏ చదివారు. తొలుత టీడీపీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో వేలివెన్ను ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి సర్పంచ్ ఆరేపల్లి వెంకట్రావు పదవిలో ఉండగా మరణించడంతో శేషారావు ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా కొనసాగారు. 2000 నుంచి 2009 వరకు సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు విజయం సాధించి గ్రామాభివృద్ధికి కృషి చేసారు. 2009లో సర్పంచ్‌గా పదవిలో ఉండగా నిడదవోలు నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. నాడు తొలిసారి నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిం చి శాసనసభలో అడుగుపెట్టారు. రెండో సారి 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మూడో సారి ఓటమి చెందారు.అప్పటి నుంచి నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఈ పదవి రావడం పట్ల నియోజవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శేషారావుకు అభినందనలు తెలిపారు.

సంతోషంగా ఉంది..

పార్టీ ఇచ్చిన పదవిని అంకిత భావంతో నిర్వహిస్తా. ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు , సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు.

- బూరుగుపల్లి శేషారావు, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగపరంగా జ్యుడీషియల్ అధికారాలు కలిగిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత చోళ్ల బొజ్జిరెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం బోలగొండలో కొండరెడ్డి తెగకు చెందిన ఈయన గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుడిగా తన కెరీర్ ప్రారంభించారు.ఆర్ఎస్ఎస్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి 2009 ఎన్నికల్లో బీజేపీ తరఫున రంపచోడవరం నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు.అనంతరం బీజేపీలో కీలకంగా ఉంటూ ప్రస్తుతం అల్లూజిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని బొజ్జిరెడ్డికి కేటాయించారు.

సమస్యలు పరిష్కరిస్తా..

గిరిజన హక్కుల పరిరక్షణకు పాటు పడతా.. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి సాగిస్తా.ఈ పదవిని అప్పగించి నందుకు ప్రధాని మోదీ , పురందేశ్వరి, సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు.

- చోళ్ల బొజ్జిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ

మండపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆశలు ఫలించాయి. ఎదురుచూపులకు ఫలితం దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన మండపేట నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది.వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఇంటర్ చదివారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.తొలుత కాంగ్రెస్‌లో ఉన్నారు. 1995-2004 వరకు వల్లూరు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా 2000 నుంచి 2007 వరకు,పీసీసీ కార్యదర్శిగా 2011 నుంచి 2014 వరకు, మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా 2009 నుంచి 2014 వరకు పనిచేశారు. 2015- 2019 వరకు మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2019లో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.2019లో మండపేట నియో జకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా ఉన్నారు.ముందుగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర సాగు నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది.

సాగునీటి పారుదల అభివృద్ధికి కృషి

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు.నాపై ఎంతో నమ్మ కంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా.సాగునీరు సరఫరాపై దృష్టి పెడతా. సాగునీటి వ్యవస్థలో మార్పులు చేర్పులపై నిపుణులతో చర్చించి చర్యలు తీసుకుంటా .

- లీలాకృష్ణ, ఏపీఎస్ఐడీసీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరించింది. తొలుత డీసీసీబీ చైర్మన్ పదవికి పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపించింది.ఆఖర్లో అనూహ్యంగా ఈయనకు పదవి దక్కలేదు. అయి తే ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్‌లాంటి పెద్ద పదవిని మర్రెడ్డి చేపట్టలేరనే వాదన ప్రధానంగా పార్టీ అధినేత వద్ద వ్యక్తమైందని సమాచారం.దీంతో మర్రెడ్డికి అవకాశం చేజారిపోయినట్లయిందని పలువురు జనసేన నేతలు విశ్లేషించారు. అదే సమయంలో కౌడా చైర్మన్ తుమ్మలబాబును పిలిపించి ప్రస్తు తం డీసీసీబీ వందల కోట్ల అప్పుల్లో ఉన్నందున దీన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన విషయాన్ని వివరించి ఈయన పేరును ఖాయం చేసినట్లయింది. ఇదిలాఉంటే తుమ్మలబాబుకు తాజా కుర్చీతో కలిపి మొత్తం మూడు పదవులు చేతిలో ఉండడంపై జనసేన వర్గాలే విస్తుపోతున్నాయి. త్వరలో కౌడా కు కొత్త నేతను ఎంపిక చేస్తారని సమా చారం.కౌడా చైర్మన్ కుర్చీ టీడీపీకి ఇవ్వవచ్చనే ప్రచారం ఇరుపార్టీల్లో వ్యక్తమవుతోంది.

బాధ్యతగా చేస్తా

ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తా. పార్టీ అధిష్టానం ఉంచిన గురుతర బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించగలననే నమ్మకం, విశ్వాసం ఉంది.

- తుమ్మల బాబు

డీసీఎంఎస్ చైర్మన్‌గా చంద్రమౌళి

అమలాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెనుకబడి సామాజికవర్గానికి చెందిన ఆయన్ను ఈ పదవిలో నియమించడం ద్వారా కోనసీమ జిల్లాలోని బీసీ సామాజికవర్గానికి న్యాయం చేసినట్టయింది.చంద్రమౌళి 1964 ఆగస్టు 27న జన్మించారు. బీఏ చదివిన ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి గ్రామ, మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పదవులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా బీసీసెల్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు, ఆ తరువాత రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పలు పర్యాయాలు సేవలందించారు.అల్లవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా మౌళి పనిచేసి టీడీపీ కి విశిష్ట సేవలందించారు. చంద్రమౌళికి బీసీ కోటాలో డీసీఎంఎస్ పదవిని కేటాయించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులతో పాటు మార్కెటింగ్ కార్యకలాపాల ద్వారా వారికి ఉన్నతమైన సేవలను అందించడమే లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి వెల్లడించారు. డీసీఎంఎస్ ఆస్తుల పరిరక్షణ, రైతులకు సేవ అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



ఊరేగిన సత్యదేవుడు

అన్నవరంలో గత మూడు రోజులుగా కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సత్యదేవుడి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.. రథంపై ఊరేగుతున్న రత్నగిరివాసుడిని చూసి తరించేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు.. దీంతో ఎటు చూసినా భక్తజనమే.. ఓం నమో సత్యదేవాయ నామస్మరణతో కొండంతా మారుమ్రోగిపోయింది.. సత్యదేవుడు.. అనంతలక్ష్మి కొలువై ఉన్న రథాన్ని లాగేందుకు భక్తజనం పోటీపడ్డారు..

- వివరాలు 7లో



భీమేశ్వరాలయంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ద్రాక్షారామ,మే11(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్, ఇండియా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆదివారం క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించారు.ఉదయం 10 గంటల ప్రాంతంలో క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందం ఆలయంలోపల,ప్రాంగణంలోతనిఖీలు చేపట్టారు.బేడామండపం, అంతర్ ప్రాం గ ణం క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందంతో పాటు స్థానిక సీఐ ఎం. వెంకట నారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్ ఇతర సిబ్బంది ఉన్నారు.

రూ.143 కోట్లతో హాస్టళ్లలో మరమ్మతులు

సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా

కొత్తపేట, మే 11(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు.కొత్తపేట మండలం పలివెల పెదపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్ల ఫలితంగానే సమాజంలో వెనుకబడిన తరగతుల వారు ఉన్నత స్థాయికి చేరారన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టామన్నారు. అం బేడ్కర్ విదేశీ విద్యాపథకాన్ని పునఃప్రారంభిస్తామన్నారు.అంబేడ్కర్ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు ప్రతి గురుకులంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.కార్యక్రమంలో అమలాపురం,పి.గన్నవరం ఎమ్మెల్యేలు ఆనందరావు,గిడ్డి సత్యనారాయణ, సర్పం చ్ సాదే లక్ష్మి శ్రీనివాస్.జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ,ఈతకోట రమేష్‌కుమార్, శిల్పి రాజకుమార్ వడయార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా వీరాంజనేయులు, ఎమ్మెల్యే బండారు



అరటికి తీరని నష్టం..

ఆత్రేయపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, వర్షాలకు అరటి పంటకు అపారనష్టం కలిగింది. ఈనిక దశలో ఉన్న అరటి పంటకు ఒక్కసారిగా వచ్చిన గాలులకు చెట్లు విరిగిపోయి పంటకు నష్టం కలిగింది.ఆత్రేయపురం, లొల్ల, ఉచ్చిలి, వాడపల్లి, వద్దిపర్రు, వెలిచేరు తదితర గ్రామాల్లో రెండు రోజుల కిందట వీచిన గాలులు వర్షాలకు అరటికి నష్టం కలిగింది.వందల ఎకరాల్లో చేతికందిన పంట కుప్పకూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టాలు అంచనా వేసి ఆర్థిక సా యం అందించాలని కోరుతున్నారు. కురుసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు.పంట పాడైపోవడంతో రైతులు కన్నీటి వ్యథ చెందుతున్నారు.



కల్తీ ఏంటీ

మార్కెట్‌లో నకిలీ టీపొడి

ఉదయం లేవడంతోనే ఒక టీ పడాల్సిందే.. లేదంటే తెల్లారదు.. ముఖంలో ఆ అలసట కనిపిస్తూనే ఉంటుంది.. ఒక చుక్క పడితే.. ఆ ఛాయ్ చమక్కులే చూడరా బాయ్ అని చిరంజీవి అన్నట్టు ఉంటుంది.. డిమాండ్ ఉండడంతో వీధికో టీ దుకాణం వెలసింది.. ఒక్క రాజమ హేంద్రవరంలోనే ప్రతి రోజూ సుమారు 6 లక్షల మంది టీ తాగుతున్నట్టు సమాచారం.. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లెక్కకు మిక్కిలి ఉంటుంది.. అయితే డిమాండ్‌కు తగినట్టు నకిలీ టీపొడి విచ్చల విడిగా వినియోగిస్తున్నారు. అయినా పట్టించుకునేవారే లేరు.

- విచ్చలవిడిగా అమ్మకాలు
- కేజీ రూ.200 మాత్రమే
- చిరు టీస్టాల్స్‌లో వినియోగం
- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం
- కన్నెత్తి చూడని అధికారులు
- రాజమండ్రిలో 9 పాయింట్లు

రాజమహేంద్రవరం సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వ్యాపారం ఎక్కడ చేయగలరు.. ఎక్కడ ఎక్కువ అమ్మకాలు జరుగుతాయో అక్కడే..ఎందుకంటే అంతా సందట్లో సడేమియా.. ఏం చేసినా తిరుగుండదు..అడిగే దిక్కుండదు. తెలిసినా ఊకొడతారు..ఊరుకుంటారు..ప్రస్తుతం రాజమహేంద్రవరంలో అదే జరుగుతుంది. కల్తీ టీ పొడికి అడ్డాగా మారిపోయింది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో ప్రధాన వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..నిత్యం కోట్లలో వ్యాపారలావాదేవీలు సాగుతాయి.కనీసం కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. దీంతో నకిలీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.



ప్రధాన వాణిజ్య కేంద్రంలో ఇలా..

రాజమహేంద్రవరం హోల్‌సేల్ వ్యాపారానికి ప్రసిద్ధి.మార్కెట్‌పై వ్యాపారులకు చాలా నమ్మకం.ఇదే పెట్టుబడిగా కొంత మంది కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్‌లోకి దింపి పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం కల్తీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది. క్షణాల్లో తయారు చేసి ప్యాకింగ్ చేసి ఎటువంటి అనుమానం రాకుండా తరలించేస్తున్నారు.రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో మూడు, ఎస్‌వీజీ మార్కెట్‌లో 6 పాయింట్లలో కల్తీ టీ పొడి తయారు చేసి విక్రయిస్తున్నారు. కల్తీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతుంది. సాధారణంగా ఒరిజినల్ టీపొడి ప్యాకెట్ 250 గ్రా ములు కొనాలంటే రూ.200 నుంచి రూ.260 మధ్య ఉంటుంది.కేజీ టీపొడి కోనాలంటే రూ.600 పైనే ఉంటుంది.కల్తీ టీపొడి రూ.150 నుంచి రూ.200 లోపే వస్తుంది. అంతే కాకుండా చిన్న రూ.5 ప్యాకెట్లు అధికంగా తయారు చేసి మార్కెట్‌లోకి దింపుతున్నారు.ప్రజలు నాణ్యత చూడకపోవడం కూడా కల్తీకి కారణం.కల్తీ టీపొడి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు.

కల్తీ టీపొడి తయారీ ఇలా

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి చింతపిక్కలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటు న్నారు. వాటిని ఎండబెట్టి టీ పోడి మాదిరిగా ఆడిస్తున్నారు.దానికి జీడీపప్పు పిక్క లోపల ఎర్రని చారతో ఉండే పొరను తీసుకుని దానిని పిండిలా ఆడిస్తున్నారు.అనంతరం ఫుడ్ కలర్స్ కలిపి ఈ మిశ్రమాన్ని చింతపిక్కల పౌడర్‌లో కలిపి వేడిచేసి గచ్చుపై ఆరబెట్టి ఆరిన తర్వాత టీ పొడి ప్యాకెట్లు తయారుచేస్తున్నారు. ఇందులో కలిపే ఫుడ్ కలర్స్, జీడిపిక్కల పొర కారణంగా జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది.ఈ టీ పొడితో కాచిన టీ తాగితే ఖచ్చితంగా జబ్బుపడతారు. ప్రస్తుతం ఈ కల్తీ టీ పొడి తయారీకి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉంది.గతంలో అనపర్తిలో తయారుచేస్తే అప్పటిలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుం డా నకిలీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది.

వీధికో దుకాణం..

టీస్టాల్స్‌కు కొదువలేదు.. ఉమ్మడి జిల్లాలో ఏ వీధిలో చూసినా ఏదో ఒక మూల టీస్టాల్ కనిపిస్తూనే ఉంటుంది.చాలా టీస్టాల్స్‌లో కల్తీ టీ పొడి వినియోగిస్తున్నారు.ఈ టీ పొడికి కాస్త అల్లం, యాలకుల పొడి తగిలించి సువాసనతో అందించేస్తున్నారు.మంచి రంగు కనిపించడంతో అది కల్తీ అనే సంగతే అంతుపట్టడంలేదు. అప్పుడప్పుడు సంబంధిత అధికారులు,ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేసి ఫైన్ వేసినా పెద్దగా పట్టించుకోవడంలేదు. ఫైన్‌లు కట్టేసి నెమ్మదిగా మళ్లీ కల్తీ టీపొడి తయారు చేసుకుని ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.కల్తీ టీపొడి పట్టుకున్నప్పుడు వారి వ్యాపార లైసెన్సులు రద్దుతో పాటు వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు లేకపోవడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించి నిఘా పెడితే కల్తీ వ్యాపారాలకు చెక్ పడే అవకాశం ఉంది.

అశేష భక్తజనమయం...
సత్యదేవుని రథోత్సవం


రథోత్సవ సేవను ప్రారంభిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్


రథోత్సవంలో భక్తులు

అన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల్లో నిర్వహించే గ్రామసేవల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండుగగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారుచేయించిన నూతన టేకురథంపై ఆశీనులు గావించారు. చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు టెంకాయి కొట్టి రథోత్సవం ప్రారంభించారు. రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆంధ్రాబ్యాంక్ వరకు వెళ్లి అక్కడ నుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్ గేట్ వరకు కొనసాగి తిరిగి కాంప్లెక్స్ వద్ద నూతనంగా ప్రారంభించిన రథశాల వద్ద ముగిసింది. అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జనసందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది రథోత్సవంలో పాల్గొనాలని ఈవో ఆదేశాలు జారీచేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులుపొడవు కలిగిన ఈ రథం లాగేందుకు సుమారు 50 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, నాయీబ్రాహ్మణులు 50మందితో పాటుగా ముందుభాగంలో ట్రాక్టర్, వెనకభాగంలో జేసీబీ సాయంతో ఇబ్బంది లేకుండా ముందుకు కదిలించారు. ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో సుమారు 50మంది బందోబస్తు నిర్వహించారు.

నయనానందకరంగా వనవిహారం

సత్యదేవుడి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం వనవిహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకీలో కొండదిగువన ఉన్న ఉద్యానవనానికి తీసుకుకొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెండి సింహాసనంపై నవదంపతులను, మరో వేదికపై పెళ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం కొండపైకి తీసుకెళ్లారు.


సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి
నక్షత్ర మాల విరమణ


పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసకిరణ్


స్వామివారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న స్వాములు, అర్చకులు, అధికారులు

అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన స్వయంభు కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి నక్షత్ర మాల విరమణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఏప్రిల్ 13, 14 తేదీల్లో స్వామివారి మాల ధారణ చేసిన భక్తులు 27 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షచేసి నృసింహస్వామి జయంతిరోజు గరుడముడిని శిరస్సున ధరించి ఆలయానికి వచ్చి సమర్పించారు. ఉదయం 8 గంటల నుంచి నక్షత్ర మాల దీక్షాధారులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, ఆలయ స్థానాచార్యుల వి.రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకుడు జి.రాజేష్ ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్టాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. దీక్షాధారులతో ప్రత్యేక పూజలు చేయించి దీక్ష విరమణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దీక్ష ధరించిన స్వాములతో కలిసి ఆలయ కల్యాణ మండప షెడ్డులో ఏర్పాటుచేసిన మహాశాంతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు హోమంలో పూర్ణాహుతి నిర్వహించి భక్తులందరితో హోమ ద్రవ్యాలను హోమగుండంలో వేయించారు.

ఘనంగా నృసింహ జయంతి

సాయం సంధ్యవేళలో పుట్టిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి రోజూ ఉదయం అభిషేకం, హోమం, మాఘమాసంలో కల్యాణం నిర్వహిస్తారు. ఒక నృసింహ జయంతి రోజున మాత్రమే సాయంత్రం 6 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు అర్చకుల ఆధ్వర్యంలో జరుగుతాయి. స్వామివారి నిజరూప దర్శనం ఉదయం, సాయంత్రం నృసింహ జయంతి రోజున మాత్రమే భక్తులకు కల్పిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అష్టోత్తర శత కలశాభిషేకాలు చేసి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నృసింహ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


ఇరుముడి సమర్పించడానికి వచ్చిన స్వాములు

ఏపీ ఈఏపీసెట్‌కు 3,61,299 దరఖాస్తులు

- ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849
- ఈ నెల 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహణ
- నేటి నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ : కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు


కన్వీనర్ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్-2025కు ఇప్పటివరకు 3,61,299 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849... రెండింటికీ 912మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రూ.4వేలు అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.10వేలు అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లను సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నెంబరు ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్ తెలుసుకునేందుకు హాల్ టికెట్ చివరి పేజీలో గూగుల్ మ్యాప్ ఇచ్చామన్నారు. పరీక్ష కేంద్రం పూర్తి చిరునామాను https://cets.apsche.ap.go v.in/eapcet/EAPCET_Centers.aspx ద్వారా తెలుసుకోవడంతో పాటు గూగుల్ మ్యాప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2359599, 2342499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@ apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సూచించారు.

175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

మంత్రి వాసంశెట్టి సుభాష్


పి.గన్నవరం హైస్కూల్లో విద్యార్థులకు నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను చూడాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు రాష్ట్రంలో 175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. వైసీపీ హయాంలో నిరుద్యోగులను కల్తీ మందు, గంజాయి వైపు మళ్లించి వారి భవిష్యత్తుతో ఆటలాడుకున్నారని, జగన్ మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలరాణి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా పి.గన్నవరం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ప్రతీ నియోజక వర్గంలో జాబ్‌మేళాలు ఏర్పాటు చెయ్యడంతో పాటు డీఎస్సీలో 16,450 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. రాబోయే రెండేళ్లలో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. మొదటి విడతగా మే 1న సుమారు 35 నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. ఈక్రమంలోనే కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.11.05 కోట్లతో ఏర్పాటు చెయ్యనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, హోసూరులలో అప్రెంటిస్‌షిప్ ట్రైనీకి ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందించారు. తొలుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హైస్కూల్ ఆవరణలో ఉన్న సరస్వతిదేవి, వివేకనందుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాబ్‌మేళాను ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, వాసంశెట్టి కుమార్, చొల్లంగి సత్యనారాయణ మూర్తి,నక్కా సత్యనారాయణ తదితరులున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన తిగిరిపల్లి విద్యాసాగర్(18)ఆదివారం బైక్‌పై కాపవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎస్‌టర్నింగ్ వద్ద పంగిడి వైపు వెళ్తున్న గడ్డిట్రాక్టర్ ఢీకొంది. విద్యాసాగర్ బైక్‌పై నుంచి కింద పడి తల, నడుముకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అరవిందకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్టు తెలిపారు.


ట్రాక్టర్ చక్రాల కింద ఉన్న బైక్

పెళ్లి కబుర్లకు బయలుదేరి..

ట్రాలీ లారీ ఢీకొని వ్యక్తి మృతి


రాంబాబు (ఫైల్‌ఫొటో)


ప్రమాదంలో నుజ్జునుజ్జుఅయిన ద్విచక్రవాహనం

తుని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కబుర్లకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన 16వ నెంబరు జాతీయ రహదారి కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో జరిగింది. తుని రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. బూరాడ రాంబాబు (38) తన అన్నయ్య కుమార్తె పెళ్లి కబుర్లు చెప్పేందుకు విజయవాడ రాణిగారి తోట ఏరియా నుంచి శ్రీకాకుళం జిల్లా రామన్నపేటకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. తేటగుంట చేరుకునేసరికి వెనుక నుంచి రాంబాబు ద్విచక్రవాహనాన్ని ట్రాలీ లారీ బలంగా ఢీకొని ద్విచక్రవాహనంతో 200మీటర్లు లాక్కుని వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పక్కనే ఉన్న కెమెరాల ఆధారంగా ప్రమాదానికి గల కారణాన్ని అన్వేషించి లారీని పట్టుకుని కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విజయవాడలో క్యాటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవన ఉపాధి పొందుతున్నట్టు, పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐకృష్ణమాచార్యులు చెప్పారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన భాస్కర్‌రావు

ఎటపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాపురం గ్రామానికి చెందిన అల్లాడి భాస్కర్‌రావు (62) బైక్‌పై టేబుల్ ఫ్యాన్ పెట్టుకుని భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం నుంచి సీఆర్‌పీ ఎఫ్ జవాన్లతో చింతూరు వైపు నుంచి వస్తున్న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో భాస్కర్‌రావుకు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో...


వెంకటరమణ మృతదేహం

కడియం, మే 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం కాలువ గట్టున ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన గుబ్బల వెంకటరమణ (40) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరమణ గాలంతో చేపలు పట్టుకుని విక్రయించి జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లే వారు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా వెంకటరమణకు ఫిట్స్ వస్తుంటాయని కుటుంబ సభ్యులు తెలిపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల హైవే పక్కన ఉన్న సైడ్ డివైడర్‌ను ఆదివారం బైక్‌తో ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన కొత్తపల్లి ఆనంద్ (30) చిలకలపాడు నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా చొప్పెల్ల లాకుల సమీపంలో అదుపు తప్పి సైడ్ డివైడర్‌ను బలంగా ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. ఆనంద్ రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భోజనం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా..
ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

గొల్లప్రోలు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం సమీపంలో ట్రాక్టర్ ఢీకొని యువకుడు మరణించాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మత్స్యపురం గ్రామానికి చెందిన కోడా మోహన్ (22) గొల్లప్రోలు మండలం లక్ష్మీపురంలో యాళ్ల వెంకటరమణ చేపల చెరువులో పనిచేస్తున్నాడు. ఆ దివారం మధ్యాహ్నం కూలీలకు భోజనం తెచ్చేందుకు చేబ్రోలు శివారు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని మెస్‌కు బైక్‌పై వెళ్లాడు. భోజనం ప్యాకెట్లు తీసుకుని చేబ్రోలు-ఏకే మల్లవరం రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మోహన్ అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్కంఠభరితంగా...

పిఠాపురంలో తైక్వాండో పోటీలు
పాల్గొన్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


పిఠాపురంలో తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని భాష్యం స్కూలు ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో పోటీలు ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా జరిగాయి. 200 మందికి పైగా క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు పోటీపడ్డారు. ఓవరాల్ చాంపియన్లుగా పిఠాపురం క్రీడాకారులు నిలవగా, రెండోస్థానంలో కాకినాడ, మూడోస్థానంలో అమలాపురం క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, సభ్యులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, చైతన్య, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. విజేతలను భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు అభినందించారు.


చాంపియన్‌షిప్ గెలుచుకున్న క్రీడాకారులు

జేఎన్టీయూకేలో 'రీసెర్చ్ కాన్‌క్లేవ్' సదస్సు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాగ్నోల్యాబ్స్ సీఈవో యోగేశ్వరరావు


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, మే11 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ పరిశోధన అభివృద్ధి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025 సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని కాగ్నో ల్యాబ్స్ సీఈవో డాక్టర్ ఎం.యోగేశ్వరరావు పాల్గొనగా జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ చైర్మన్‌గా, వర్శిటీ పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించగా ప్రిన్సిపాల్స్ మోహన్‌రావు, శ్రీనివాసరావులు కోకన్వీనర్లు, డైరెక్టర్లు ఎ.గోపాలకృష్ణ, ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ సమన్వయకర్తలుగానూ వ్యవహరించారు. యోగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సుకత నుంచి లక్ష్యంవరకూ పరిశోధనాశక్తి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్‌స్కాలర్స్‌కు అవగాహన కల్పించారు. పరిశోధనా విభాగానికి సంబంధించి పేపర్ ప్రజంటేషన్‌లో 2017, 2022లో ప్రపంచవ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి, రెండు స్థానాల్లో ఉండగా 1,91,590 పేపర్లతో భారతదేశం 4వస్థానంలో నిలిచిందని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ వర్శిటీలో త్వరలో రీసెర్చ్‌స్కాలర్స్‌కు కేంద్రీకృత పరిశోధన, లైబ్రరీ సదుపాయం, మౌలిక వసతుల కల్పన, మ్యాట్ ల్యాబ్ కల్పిస్తామన్నారు. రీసెర్చ్ కాన్‌క్లేవ్‌కు 210మంది హాజరుకాగా వారిలో 110 మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇవ్వడం జరిగిందని డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ ఉప కులపతులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జెన్కో హైడల్ చీఫ్ ఇంజనీర్ పర్యటన


పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

మోతుగూడెం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ సివిల్ (హైడల్)గా ఉద్యోగోన్నతి పొందిన రవీందర్‌రెడ్డి ఆదివారం తొలిసారిగా లోయర్ సీలేరు పరిధిలోని పొల్లూరు, డొంకరాయి ప్రాజెక్టులను సందర్శించారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ నూతనంగా చేపట్టిన 5, 6 యూనిట్ల పనులను పరిశీలించారు. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల పొడవున్న పవర్ కెనాల్‌ను పరిశీలిస్తూ డొంకరాయి ప్రధాన ఆనకట్టకు చేరుకున్నారు. డొంకరాయి ఏపీ జెన్‌కో అధికారులు రవీందర్ రెడ్డికి సాదర స్వాగతం పలికారు. ప్రధాన ఆనకట్ట, 25మెగావాట్ల మినీ పవర్‌హౌస్, శాండిల్ పికప్ డ్యాములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పర్యటనలో ఎం.శేఖర్ (ఎస్ఈ సివిల్, విద్యుత్ సౌధ విజయవాడ), లోయర్ సీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, డొంకరాయి జెన్‌కో అధికారులు, ఏఈలు శివశంకర్, విజయ్‌పాల్, మురళీకృష్ణ ఉన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.30లక్షలు

ఆత్రేయపురం, మే 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.4,30,532 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. నోము ఆచరించి, అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు.

శెట్టిబలిజ సంఘ కార్యవర్గం

మలికిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): గుడిమెళ్లంక శెట్టిబలిజ సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కడలి వీరవెంకటసత్యనారాయణ, చెల్లింగి జగన్‌లను ఆదివారం ఎన్నుకున్నారు. గుడిమెళ్లంకలో జరిగిన సమావేశంలో శెట్టిబలిజ సంఘ పెద్దలు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఈ ఏడాదైనా ట్రఫ్ పనులు జరిగేనా?

- కాల్వలు మూసినా ప్రారంభంకాని పనులు
- రెండుసార్లు ప్రతిపాదనలు పంపించాం, అనుమతులు రాలేదని అంటున్న అధికారులు



గుడిమెళ్లంకలో మోరికాల్వపై శిథిలస్థితిలో ట్రఫ్

మలికిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులకు సక్రమంగా సాగునీరు అందేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని, ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని జలవనరుల శాఖ చెబుతున్న మాటలు అమలు జరుగుతాయా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గుడిమెళ్లంకలో మోరి కాల్వ వేపచెట్టు డ్రెయిన్ వద్ద ట్రఫ్ శిథిలమై దశాబ్ద కాలం అయినా జలవనరుల శాఖ పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు చేస్తున్నారు. గత ఏడాది దాళ్వా ముమ్మర సమయంలో ట్రఫ్ శిథిలమవడంతో సాగునీరు వేపచెట్టు డ్రెయిన్‌లోకి పోయింది. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందలేదు. తక్షణ చర్యలుగా మలికిపురం నీటిసంఘం ఆధ్వర్యంలో రూ.2లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సాగునీరు పంపిణీచేసి మమా అనిపించారు. ఈఏడాది కాల్వలు కట్టేసిన తరువాత ట్రఫ్ నిర్మాణం జరుగుతుందని, రైతుల సమస్యలు తీరుతాయని ఆశించారు. కానీ ఈఏడాది కూడా జలవనరుల శాఖ ఈ ట్రఫ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదని తెలిసింది. ఈకాల్వ పరిధిలో 500ఎకరాల ఆయకట్టు ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈఈ రమేష్, మలికిపురం నీటిసంఘం అధ్యక్షుడు తిరమల సుబ్బారావును అడగ్గా రూ.50లక్షలతో రెండుసార్లు ప్రతిపాదనలు పంపామని, అనుమతి లభించలేదని అన్నారు. తాత్కాలికంగా తాము మరమ్మతులు చేసినా రూ.2లక్షలు కూడా విడుదల చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారా మరోసారి ప్రయత్నం చేస్తామని వారు తెలిపారు.

ముమ్మిడివరంలో అపారిశుధ్యం

- పేరుకుపోతున్న చెత్త
- ముక్కు మూసుకుంటున్న ప్రజలు
- ఏదీ స్వచ్ఛభారత్
- పారిశుధ్య సిబ్బంది కొరత





ముమ్మిడివరం ఆసుపత్రి వీధిలోని మసీదు సమీపంలో డస్టబిన్ నిండిపోయి చిందరవందరగా ఉన్న చెత్త
మెయిన్ రోడ్డులో ఎస్‌బీఐ సమీపంలో డస్టబిన్ నిండిపోయి చిందరవందరగా ఉన్న చెత్త

ముమ్మిడివరం, మే 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ అంటూ చేత్తో చీపుర్లు పట్టి ఫొటోలకు ఫోజులిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుధ్య కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించడంలో విఫలమయ్యారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో ఎక్కడకు వెళ్లినా చెత్తే దర్శనమిస్తుంది. కుక్కలు, పందులు చెత్తను చిందరవందర చేయడంతో, డస్టబిన్‌లోని చెత్త కుళ్లిపోవడంతో తీవ్ర దుర్గంధం ఏర్పడి అపారిశుధ్యం నెలకొంది. అసలే పెళ్లిళ్ల సీజన్.. కంపెక్టర్ మిషన్ మరమ్మతులకు రావడం.. పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలో చెత్తను తొలగించకపోవడం వంటి కారణాలతో నగర పంచాయతీ పరిధిలో ఏ వీధి చూసినా కుళ్లిన చెత్తతో కంపు కొడుతోంది. ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో పారిశుధ్య సిబ్బంది లేకపోవడం, చెత్తను తరలించేందుకు సరైన సంఖ్యలో యంత్రాలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. నగర పంచాయతీ 20వార్డుల్లో 25,355మంది ప్రజలు ఉన్నారు. 3, 4, 17, 18, 19 వార్డుల్లో షాపులు, హోటళ్లు, ఆసుపత్రులు వంటివి ఉండడంతో ఇక్కడ ఎక్కువగా చెత్త పేరుకుపోతోంది. నగర పంచాయతీ పరిధిలో వాస్తవానికి 60మంది పారిశుధ్య కార్మికులు అవసరం కాగా కేవలం 34మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఒకరు పర్మినెంట్ కాగా 27 మంది అవుట్ సోర్సింగ్, ఆరుగురి రోజూవారి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తోన్నారు. చెత్తను వేయడానికి 22 డస్టబిన్లు ఏర్పాటుచేశారు. ఇవి కాకుండా ఏడు సచివాలయాల పరిధిలో చెత్తను సేకరించేందుకు ఏడు బ్యాటరీ వాహనాలు కూడా ఏర్పాటు చేశారు. డస్టబిన్‌లో వేసిన చెత్తను కాంపెక్టర్ మిషన్ ద్వారా తీసి ట్రాక్టర్లతో తొలగిస్తారు. అయితే ఆ మిషన్ మరమ్మతులకు గురికావడంతో నెలరోజులుగా డస్టబిన్‌లో చెత్తను కార్మికులు చేతికి అందినంతవరకు తీసి ట్రాక్టర్‌లో వేసి తరలిస్తున్నారు. అయితే డస్టబిన్‌లోని చెత్తను పూర్తిగా తొలగించేందుకు వీలుపడక పైపైనే అందినంత మేరకు మాత్రమే చెత్తను తొలగిస్తున్నారు. దీంతో ఆయా డస్టబిన్లు వెనువెంటనే నిండిపోతున్నాయి. పారిశుధ్య కార్మికులు కొన్నిచోట్ల చెత్తను ప్రతీరోజు తీయకపోవడంతో డస్టబిన్‌లో చెత్త దుర్గంధం వెలువడుతోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో మిగిలిపోయిన ఆహారపదార్థాలు, చెత్తను డస్టబిన్‌లో పడవేస్తున్నారు. కుక్కలు, పందులు ఆ చెత్తను చిందరవందర చేస్తున్నాయి. దీంతో దుర్గంధం వెలువడుతోంది. దీనిపై నగర పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే డస్టబిన్‌లోని చెత్తను ప్రతీరోజు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంఎల్‌సీ పాయింట్ ఏర్పాటును నిలుపుదల చేయండి



పి.గన్నవరంలో మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న నగరం సివిల్ సప్లయి వర్కర్స్

పి.గన్నవరం, మే 11(ఆంధ్రజ్యోతి): నగరం సివిల్ సప్లయి గోదాము నుంచి మరో ఎంఎల్‌సీ పాయింట్(సఖినేటిపల్లి)ఏర్పాటును నిలుపుదల చేసి, జీవనోపాధిని మెరుగుపరచాలని కోరుతూ పి.గన్నవరంలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం నగరం సివిల్‌సప్లయి వర్కర్స్ వినతి పత్రం అందించారు. నగరం ఏఎంసీ గోదాము ఎంఎల్‌సీ పాయింట్‌లో 20మంది కూలీలు 25ఏళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. పి.గన్నవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు సంబంధించిన నిత్యావసరాల ఎగుమతులు, దిగుమతులు చేస్తున్నామన్నారు. సఖినేటిపల్లిలో మరో ఎంఎల్‌సీ పాయింట్ ఏర్పాటుచేస్తే సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాలు ఆ పాయింట్‌లోకి వెళ్లిపోతాయని మంత్రికి వివరించారు. మామిడికుదురు, పి.గన్నవరం మండలాలు మాత్రమే మిగిలి ఉంటాయని, ఎగుమతులు, దిగుమతులు తగ్గిపోవడంతో కూలీలకు జీవనోపాధి కష్టంగా ఉంటుందన్నారు. ఈవిషయాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మట్టపర్తి సూర్యచంద్ర భాస్కరరావు, పెచ్చెట్టి శ్రీనివాసరావు, కడలి సత్యప్రసాద్, వారణాసి శ్రీనివాసరావు, కడలి కనక రాజు, చప్పిడి రాంబాబు, పితాని రమణ, ముషిణి వెంకటేష్, సత్తిబాబు ఉన్నారు.

గరుడేశ్వరస్వామి రథోత్సవం



గరుడేశ్వరస్వామి రథోత్సవం

పి.గన్నవరం, మే 11(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీబాలాత్రిపురసుందరి సమేత గరుడేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఆశీనులు గావించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు బైరవభట్ల సత్యనారాయణమూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొంది

షిర్డిసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



అంబాజీపేట, మే 11(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రులో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీషిర్డిసాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నేదునూరి వెంకటేశ్వరరావు- సీతామహాలక్ష్మి, నేదునూరి నాగేశ్వరరావు- వెంకటరమణి ఆధ్వర్యంలో బాబా ఆలయంలో విఘ్నేశ్వరపూజ, మండప పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాబాను దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

తాగునీరందాలంటే అనధికార కుళాయిలు తొలగించాలి

- స్థానికేతర అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శివారు ప్రాంతాల ప్రజల డిమాండ్



అక్రమ వాటర్ పైప్ కనెక్షన్లు తొలగిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం, మే 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు దగ్గరగా ఉన్న ప్రాంతాలకు అవసరాలకు మించి ఎక్కువగా తాగునీరు అందుతోంది. క్రమంగా శివారుకు వచ్చేసరికి తగిన స్థాయిలో నీరందక జనం ఇక్కట్లు పడుతున్నారు. ఫలితంగా తాగునీటి కోసం ప్రతిరోజూ మహిళలు ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. అధికారులకు ఇస్తున్న వినతి పత్రాల్లో తమకు తాగునీరందక పోవడానికి కారణాలను ఉటంకిస్తున్నారు. గ్రామాల్లో అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, వాటి ఉనికిని ప్రస్తావిస్తున్నారు. అయితే అధికారుల నుంచి స్పందన మాత్రం శూన్యం. పంచాయతీలు అక్రమ కనెక్షన్లు, మోటార్ల తొలగింపు విషయాల్లో తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నో పర్యాయాలు పంచాయతీలు, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీసుల ఆధ్వర్యంలో అక్రమ కనెక్షన్లు, మోటార్లు తొలగించారు. ఎనిమిది మోటార్ల కనెక్షన్లు తొలగించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు. పేరాయిచెరువు, మధురపేట, అల్లవరం మండలం నక్కారామేశ్వరం గ్రామల్లో అక్రమ కనెక్షన్లు తొలగించామన్నారు. పంచాయతీలు తమకు సహకరించడం లేదన్నారు. ప్రజలందరికి సరిపడా తాగునీరు ప్రాజెక్టుల నుంచి సరఫరా జరుగుతున్నా శివారు ప్రాంతాల వారు వేసవిలో తాగునీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. అక్రమ కనెక్షన్లు, మోటార్లు తొలగించాల్సిన బాధ్యత పంచాయతీలదేనని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. తాము తొలగించాలంటే రాజకీయ జోక్యం అడ్డుపడుతోందని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. అందుకే స్థానికేతర అధికారులతో స్పెషల్ డ్రైవ్ ద్వారా తాగునీటి అక్రమాలకు అడ్డుకట్ట వెయ్యాలని శివారు ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అక్రమ కుళాయి కనెక్షన్లు, మోటార్ల జాబితా గ్రామ పంచాయతీల వద్ద ఉందని, స్థానికేతర అధికారుల ద్వారా డ్రైవ్ నిర్వహించేలా ఉన్నతాధికారులు ఆదేశాలివ్వాలని కోరుతున్నారు.

క్రికెట్ ట్రోఫీ విన్నర్ దరియాలతిప్ప



విన్నర్,రన్నర్ జట్లుకు ట్రోఫీని అందేజేస్తున్న ఆర్‌వి మునిస్వామి

యానాం, మే 11(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో యానాం క్రికెట్ అసోసియేషన్ సేచెమ్‌ట్రోఫీ-2025 లీగ్‌కం నాకౌట్ టోర్నమెంట్ విజేతగా దరియాలతిప్ప జట్టు నిలిచింది. స్థానిక మెట్టకుర్రు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దరియాలతిప్ప-అగ్నిలైన్స్ జట్లు పోటీపడ్డాయి. విన్నర్‌గా దరియాతిప్ప, రన్నర్‌గా అగ్నిలైన్స్ జట్లు నిలిచాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, సీఐ అడలరసన్, ఎస్ఐ పునీత్‌రాజ్‌లు హాజరై విన్నర్, రన్నర్లకు బహుమతులు అందజేశారు. కార్యాక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.రమేష్‌నాయుడు, కె.సుబ్బారావు, పి.ప్రసాద్, కె.సత్యనారాయణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు పి.సుమన్‌బాబు, జె.జయచంద్ర, కె.వరప్రాసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇటికాలమ్మ అమ్మవారి జాతర



అంబాజీపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామదేవత శ్రీఇటికాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జాతరలో గరగనృత్యాలు, కోయి డ్యాన్సులు, సంగీత విభావరి అందర్ని అలరించాయి. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి తీర్థం సందర్భంగా పూజా ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆడపడుచులతో గ్రామమంతా కళకళలాడింది.

నాడు గుంతలు... నేడు రాచ బాటలు





పి.గన్నవరం-అమలాపురం రోడ్డులో పోతవరం వద్ద రహదారి నాడు, నేడు దృశ్యాలు

పి.గన్నవరం, మే 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్ని ఉద్యమాలు, నిరసనలు చేపట్టినప్పటికి వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. గుంతల రహదారుల్లో ప్రయాణం చేయడానికి వాహనదారులు అవస్థలు పడ్డారు. రహదారులన్నీ అభివృద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నాడు గుంతలుగా ఉన్న రహదారులను నేడు రాచబాటలుగా మార్చారు. పి.గన్నవరం నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దారు. పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకు ఉన్న రహదారి నాడు గుంతలతో ప్రయాణికులు నరక యాతన పడేవారు. కానీ నేడు రహదారులు పూర్తికావడంతో వాహన దారులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

మలికిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): మట్టపర్రు మాజీ సర్పంచ్ కడలి నాగేశ్వరరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మట్టపర్రులో కడలి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాగేశ్వరరావు గ్రామాభివృద్ధికి ఎంతో కష్టపడ్డారని అన్నారు. గ్రామస్థులంతా కలిసి సంఘీభావంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. సర్పంచ్ కడలి దుర్గాదేవి, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ ఎంపీ సత్యవాణి, అడబాల యుగంధర్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, ముత్యాల దుర్గాదేవి, కనుమూరి నరసింహ రాజు, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



విద్యార్థులకు ప్రైజ్‌మనీ అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం అయినవిల్లి మండలశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఆదివారం స్థానిక మండడల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పదకొండు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైజ్‌మనీ, మెమెంటోలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. కీర్తిశేషులు దుక్కిపాటి శ్రీనివాసరావు అవార్డును విశ్రాంత ఉపాధ్యాయుడు బద్దె రాంప్రసాద్‌కు ఎమ్మెల్యే అందజేసి ఘనంగా సత్కరించారు. ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా పంచరాత్రి దివ్య కల్యాణం

అమలాపురం రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పాత బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం పంచరాత్రి దివ్య కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీశైలం మాజీ ట్రస్టు సభ్యుడు చింతా శంకరమూర్తి ఇంటి వద్ద అత్యంత వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. స్వామి-అమ్మవార్లు ఊరేగింపుగా శంకరమూర్తి ఇంటి వద్దకు వచ్చి సత్యనారాయణ పౌరోహిత్యంలో శంకరమూర్తి దంపతులు కర్తలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్రిశూలాన్ని శిరస్సుపై పెట్టి స్నానం చేయించారు. దీన్నే త్రిశూల స్నానమంటారు. ప్రసాద వితరణ జరిగింది. రాత్రి శివాలయం వద్ద నాగవల్లీ సేవ, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కాట్రేనికోన, మే 11(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన 1998-99 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదంగా జరిగింది. పాఠశాలలో కలసిన పూర్వవిద్యార్థులు గత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. విశ్రాంత హెచ్‌ఎం రాయుడు సత్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసరావు, దాసు, ఆనందరావు, వెంకటేశ్వరరావు, మునలయ్య, సంజీవయ్య, లక్ష్మాజీ, కుమార్, శేషవేణి, రామకృష్ణలను ఘనంగా సత్కరించారు.



ఘనంగా ఇమామ్ అలీరజా జయంతి

మామిడికుదురు, మే 11(ఆంధ్రజ్యోతి): ఇమామ్ అలీరజా జయంతి ఉత్సవాన్ని ముస్లింలు శనివారం రాత్రి ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో మిలాద్ జరిగింది. మామిడికుదురులోని ఇమామ్ మూసేరజా పంజాలో జరిగిన మిలాద్‌లో పలువురు కవులు కసీదాలు ఆలపించారు. మత గురువు మౌలానా సయ్యద్‌అబ్బాస్‌బాకరీ, అలీ రజా జయంతి ప్రధాన ఘట్టాలను భక్తులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, మే 11(ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామంలో వీరభద్రస్వామి సంబరాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాకారులు వీరనాట్యం చేస్తూ మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో నిర్వహించిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతులకు రూ.64.78లక్షల మంజూరు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో 14 కాల్వల్లో పూడిక తొలగింపునకు రూ.64.78లక్షలు మంజూరైనట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కూనవరం నంబరువన్ కాల్వలకు రూ.2లక్షలు, బి.సావరం కాల్వకు రూ.2.77లక్షలు, చింతలపల్లి నంబర్1కు రూ.1.86 లక్షలు, చింతలపల్లి-2 2.30లక్షలు, రాజోలు చానల్‌కు రూ.4.43లక్షలు, గూడపల్లి నవంబర్-1, 2కాల్వలకు రూ.13లక్షలు, రామరాజులంక ఓపీపీఆర్‌కు రూ.3.39లక్షలు, రామరాజులంక బ్రాంచి కాల్వకు రూ.2.70లక్షలు, రామరాజులంక మెయిన్ కాల్వకు రూ.3.93, సఖినేటిపల్లి వైర్‌చానల్స్‌కు రూ.17లక్షలు, నత్తలోవ కాల్వకు రూ.1.31లక్షలు కేటాయించినట్టు తెలిపారు. ఈనిధులతో కాల్వల్లో పూడిక తొలగిస్తారని అన్నారు. చెన్నడం కాల్వ ట్రఫ్ మరమ్మతులకు రూ.9.99లక్షలు మంజూరైందన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, నీటిసంఘం అధ్యక్షుడు తిరుమల సుబ్బారావు, రాపాక మల్లికార్జునరావులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): గొందిలో వేంచేసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శృంగవరప్పాడులోని బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆలయాల వద్ద చీరల వేలం పాట నిర్వహించారు.

మంత్రి సుభాష్‌కు ఘన సన్మానం



మంత్రి సుభాష్, నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు మండలంలోని పలుచోట్ల ఘనంగా సత్కరించారు. పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు సంసాని పెద్దిరాజు, మాజీ ఎంపీపీ లక్ష్మీగౌరి దంపతులు మంత్రిని దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావులను కూడా సన్మానించారు. మొండెపులంక శెట్టిబలిజ పెదపాలెం రామాలయం వద్ద పలువురు గ్రామస్తులు మంత్రి సుభాష్‌ను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో చొల్లంగి సత్యనారాయణమూర్తి, గుడాల రమణ, అంచూరి రమేష్, నక్కా సత్యనారాయణ, కడలి రామకృష్ణ, శ్రీరామ యువజన శెట్టిబలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భజన కళాకారుడికి ఘన నివాళి

మామిడికుదురు, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ భజన కళాకారుడు కడలి సత్యనారాయణ భాగవతకు మామిడికుదురులో ఆయన శిష్య బృందం ఘన నివాళులర్పించారు. మామిడికుదురులోని బుల్లియ్యగారి వంతెన వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటుచేసి ఘన నివాళులర్పించారు. ఆయన మూడు పర్యాయాలు స్వర్ణసింహ తలాటం తీసుకున్నారని, రాష్ట్రస్థాయిలో జరిగిన భజనల పోటీల్లో ప్రథమస్థానం సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో గుబ్బల వెంకటేశ్వరరావు, సానబోయిన దాసు, రాయుడు నాగేశ్వరరావు, గుత్తుల శ్రీనివాసరావు, గుబ్బల ప్రసాద్, కాండ్రేగుల శ్రీనివాస్, కడలి నూకరాజు, కంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు బస్‌కాంప్లెక్స్‌లో పోలీసుల తనిఖీలు



రాజోలు, మే 11(ఆంధ్రజ్యోతి): రాజోలు బస్ కాంప్లెక్సులో ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ బి.రాజేష్ కుమార్ తన సిబ్బందితో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బస్ కాంప్లెక్సులో ఉన్న యువకుల వద్దనున్న బ్యాంగులను తనిఖీలు చేశారు. ప్రతీ ప్రయాణికుని వద్దకు వెళ్లి మీరు ఎక్కడి నుంచి వచ్చారు, ఎక్కడికి వెళుతున్నారని అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా రాజోలు సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ భారత్, పాక్ యుద్ధ వాతావరణం దృష్ట్యా, భద్రత కారణాల దృష్ట్యా తనిఖీలు నిర్వహించామన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

యానాం, మే 11(ఆంధ్రజ్యోతి):యానాంజీఎంసీ బాలయోగినగర్‌లో బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్టు యానాం చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సం సాని రవికుమార్ తెలిపారు. బాలయోగినగర్‌లో బాల్య వివాహం జరుగుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులతో అక్కడికి వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నట్టు రవికుమార్ తెలిపారు. ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. 18ఏళ్ల దాటితే వివాహం చేయాలని సూచించామన్నారు. బాల్యవివాహాలపై 1098కు సమాచారం ఇస్తే, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఘనంగా శాంతి హోమం



మామిడికుదురు, మే 11(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలో వేంచేసి ఉన్న ధనమ్మ, సోమాలమ్మ ఆలయాల ప్రాంగణంలో ఆదివారం శాంతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో ఇటీవల జరిగిన అరిష్టాలను పురస్కరించుకుని శాంతి హోమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సురక్షితంగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ పూజలు చేశారు.

అంతర్వేది ఆలయంలో పశ్చిమ జేసీ రాహుల్ పూజలు



అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆయానికి పశ్చిమగోదావరి జిల్లా భీమవరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం కల్పించి, వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

మాజీ సర్పంచ్ నాగేంద్రుడు మృతి



ఉప్పలగుప్తం, మే 11(ఆంధ్రజ్యోతి) వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ నక్కా నాగేంద్రుడు(88) ఆదివారం మృతి చెందారు. ఆయన 2001-05 కాలంలో వానపల్లిపాలెం సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల గ్రామసర్పంచ్ నల్లాబాబు విచారం వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.30 లక్షలు

ఆత్రేయపురం, మే 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,30,532 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



సోమేశ్వరంలో శివుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

ఘనంగా సోమేశ్వరస్వామి రథోత్సవం

రాయవరం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో గంధం సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో అలంకరణ జరిపి అర్చనలు, హారతులు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. సోమేశ్వరం పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వైఆర్కే పరమహంస, రావుల రామకృష్ణ, పలువురు కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది పి.వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఈతకోట జడ్పీ పాఠశాలలో సందడి చేసిన పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

రావులపాలెం, మే 11(ఆంధ్రజ్యోతి): ఈతకోట జడ్పీ పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి సందడి చేశారు. ప్రధాన ఉపాధ్యాయుడు కేఎస్వీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులంతా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. అప్పట్లో క్లాస్‌రూమ్‌లో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను తలుచుకున్నారు. అప్పటి గురువులైన అప్పన శాస్త్రి, వీరవెంకట సత్యనారాయణలను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



కె.గంగవరం మండలం కూళ్ల సమీపంలో గోదావరి చెంతన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

బొండాలు ధాన్యం కొనేవారెవరు?

• ఆందోళన చెందుతున్న రైతులు • దళారుల ప్రవేశంతో నష్టపోతున్న వైనం

మండపేట, మే 11(ఆంధ్రజ్యోతి): బొండాలు ధాన్యం రైతులపాలిట గుదిబండగా మారింది. జిల్లాలో సగానికి పైగా రైతులు దాళ్వాలో వాటిని సాగుచేశారు. ప్రస్తుతం సీఎంఆర్ లేకపోవటంతో వాటి కొనుగోలును మిల్లర్లు నిలుపుదల చేశారు. మరోపక్క బొండాలు ధాన్యం రైతుసేవా కేంద్రాల్లో కొనడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులు అయినకాడికి దళారులకు ధాన్యం అమ్ముకుని గిట్టుబాటు ధరలేక నష్ట పోతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా కల్లాల్లో బొండాల ధాన్యం రాశులు కనిపిస్తు న్నాయి. జొన్నాడ-యానాం ఏటుగట్టు చెంత, కె.గంగవరం మండలం కూళ్ల సమీపంలో పలువురు రైతులు గోదావరి ఒడ్డున ధాన్యాన్ని ఆరబెడుతూ తేమశాతాన్ని తగ్గించుకుంటున్నారు.



నియామక పత్రాలు అందచేస్తున్న వాసంశెట్టి సత్యం

జాబ్ మేళాలో 39 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని చంద్రబాబు ఉపాధి కార్యాలయంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 39 మంది ఎంపికయ్యారు. హెటిరో డ్రగ్స్‌కు 6, కియా మోటార్స్‌కు 9, బ్లూస్టార్ 14, ఎన్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, ఏషియన్ ఆటో పార్ట్స్, పానాసోనిక్‌లకు 10 మంది ఎంపికయ్యారు. వీరికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు సమీర్, మురళి, సుధాకర్, చంద్రబాబు ఉపాధి ప్రాజెక్టు డైరెక్టరు రామ్‌కుమార్, సీఈవో అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరు

మలికిపురం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో 14 కాల్వల్లో పూడిక తొలగింపునకు రూ.64.78లక్షలు మంజూరైనట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కూనవరం నంబరువన్ కాల్వలకు రూ.2లక్షలు, బి.సావరం కాల్వకు రూ.2.77లక్షలు, చింతలపల్లి నంబర్1కు రూ.1.86లక్షలు, చింతలపల్లి-2 2.30 లక్షలు, రాజోలు చానల్‌కు రూ.4.43లక్షలు, గూడపల్లి నవంబర్-1, 2కాల్వలకు రూ.13లక్షలు, రామరాజులంక ఓపీఆర్‌కు రూ.3.39లక్షలు, రామరాజులంక బ్రాంచి కాల్వకు రూ.2.70లక్షలు, నత్తలోవ కాల్వకు రూ.1.31లక్షలు కేటాయించినట్టు తెలిపారు. ఈనిధులతో కాల్వల్లో పూడిక తొలగిస్తారని అన్నారు. చెన్నడం కాల్వట్రఫ్ మరమ్మతులకు రూ.9.99లక్షలు మంజూరైందన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, నీటిసంఘం అధ్యక్షుడు తిరుమల సుబ్బారావు, రాపాక మల్లికార్జునరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అంతర్వేది ఆలయంలో జేసీ రాహుల్ పూజలు

అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భీమవరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం విచ్చేశారు. స్వామివారి అంతరాలయంలో వారికి దర్శనం కల్పించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



మహిళకు పాదాభివందనం చేస్తున్న మంత్రి సుభాష్

అమ్మ ప్రేమ ఒక వరం..

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మే 11(ఆంధ్రజ్యోతి): సృష్టిలో అమ్మ ప్రేమ అపూర్వమైనదని అమ్మ ప్రేమ పొందగలగడం ఒక వరమని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాయపాలెం శివారు చంద్రబాబు నగర్‌కు చెందిన వెంగళ సత్యవతి, మంగతో పాటు పలువురు మహిళలను మంత్రి సత్కరించారు. వారికి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాతృమూర్తులను సన్మానించుకోడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.



ఎన్నెన్నో అందాలు...

మండపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) వేసవిలో మాత్రమే కనిపించే రేలచెట్టు పూలు ఇలా కనువిందు చేస్తున్నాయి. జొన్నాడ, యానాం ఏటిగట్టు మధ్యలో కూళ్ల సమీపంలో ఏటుగట్టు చెంతన పూసిన రేలపూలు చెట్టు అటువైపు వెళ్లే వారిని ఆకర్షిస్తోంది. ఏటిగట్లపై పలుచోట్ల కనిపిస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది.

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా, ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి మౌలిక వసతులకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఆదివారం వాడపాలెంలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ప్రారంభించారు. తొలుత రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు మంత్రి డోలాకు స్వాగతం పలికారు. అనంతరం వాడపాలెం పెదపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదే పేటలో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. మారెమ్మ మాన్యంలో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు నూతన సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత పాలనలో గ్రామాల అభివృద్ధి అడుగంటిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధిపై దృష్టిసారించామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటిగా అమలు చేస్తామన్నారు. త్వరలో తల్లికి వందనం పథకం అమలుకు సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, ఎంపీపీ మార్గాన గంగాధరరావు, సర్పంచ్‌లు త్సామా బాబు, బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

మంత్రి సుభాష్



యనమదల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మే 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం రామచంద్రపురం మండలంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించనున్న పలు బీటీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అగ్రహారం నుంచి యనమదల, కొత్తూరు నుంచి మాలపాడు, వెంకటాయపాలెం నుంచి గణపతి నగరం, వెల్ల నుంచి ద్రాక్షారామ బీటీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మేలో తల్లికి వందనం పథకం, జూన్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, టీడీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు, డాక్టర్ ఎం.రాంబాబు, ప్రగతి చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ తదితరులతో పాటు పలువురు కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో నేడు
వైశాఖ పౌర్ణమి పూజలు

రాయవరం, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం వైశాఖ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆదివారం పీఠంలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించడంతో పాటు విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, నవగ్రహ, నక్షత్ర హోమం జరుగుతుందన్నారు. విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులతో సామూహిక కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తామన్నారు. పీఠంలో విజయదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన జరుగుతుందన్నారు.



వెదురుపాకలో పోలేరమ్మ అమ్మవారి గరగలను దర్శిస్తున్న పీఠాధిపతి గాడ్

పోలేరమ్మ గ్రామోత్సవం

రాయవరం, మే 11(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామస్తుల ఇలవేల్పు పోలేరమ్మ అమ్మవారి గరగల గ్రామోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ, మహాలక్ష్మి, దండి దుర్గమ్మ, బంగారమ్మ, కనకదుర్గ అమ్మవార్ల గరగలకు గ్రామంలో గ్రామోత్సవం జరపడంతో పాటు విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేశారు. పీఠాధిపతి గాడ్ అమ్మవారి గరగలను దర్శించుకున్నారు. గాడ్ కుటుంబ సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 12న వైశాఖ పౌర్ణమి రోజున పోలేరమ్మ జాతర, 13న అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టేకుమూడి రాంబాబు తెలిపారు.

సారా నిర్మూలనే లక్ష్యంగా అడుగులు

• నవోదయం 2.0తో లభిస్తున్న ఫలితాలు • అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు



రాజవరంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

ఆత్రేయపురం, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సారా నిర్మూలనే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సారా తయారీ, విక్రయ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు జరుపుతున్నారు. ఇటీవల ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో దాడులు జరిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో సారా నిర్మూలనపై నవోదయం 2.0 కార్యక్రమానికి నడుం బిగించారు. ఈ కార్యక్రమం ద్వారా అనుకున్న ఫలితాలు లభించాయని చెప్పవచ్చు. బొబ్బర్లంక, రాజవరం, పేరవరం, వెలిచేరు గ్రామాల్లో సారా ఏరులై పారుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన సారా వివిధ ప్రాంతాలకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల 67 మందిపై కేసులు నమోదు చేసి 414 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 38వేల లీటర్ల బెల్లపు ఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే 22 మందిపై అక్రమ మద్యం కేసులు నమోదు చేసి 45.62 లీటర్ల మద్యాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు 61 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఇటీవల సారా ప్రభావిత గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, కళాజాతాలు, బుర్రకథ ప్రదర్శనలు నిర్వహిస్తు ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. సారా తాగితే వచ్చే అనర్థాలు, పట్టుబడితే కేసులు వంటి వాటిపై ఎక్సైజ్ పోలీసులు విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్నారు. సారా ప్రభావిత గ్రామాల్లో దాని నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేసి సారా నివారణకు చర్యలు చేపడుతున్నారు.



పేరవరంలో సారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న సీఐ కాత్యాయని

కులధ్రువీకరణ పత్రాల అందజేత

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 11 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెంలో 1997లో నమోదు అయిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు తహశీల్దార్ జారీ చేసిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను మంత్రి సుభాష్ ఆదివారం అందచేశారు. ఈ కేసులో బాధితులుగా ఉన్న దడాల వెంకటరత్నం, కోటి చినరాజు, చల్లపూడి పట్టాభిరామయ్య కులధృవీకరణ పత్రాల జారీలో సందిగ్ధత నెలకొంది. దీంతో బాధితులు మంత్రిని కలిశారు. ఆయన ఆదేశాలతో ఈనెల 9న వారితో పాటు, వారి కుటుంబీకులకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలను తహశీల్దార్ జారీ చేశారు. వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని పోరాడుతున్నామని తెలిపారు. తమతో పాటు తమ పిల్లలకు కూడా కుల ధృవీకరణ పత్రాలు జారీ నిలిపివేశారన్నారు. ఎట్టకేలకు మంత్రి కృషితో తమకు వాటిని మంజూరు చేశారని వారు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న దృశ్యం

రాజోలు బస్ కాంప్లెక్సులో పోలీసుల తనిఖీలు

రాజోలు, మే 11(ఆంధ్రజ్యోతి): రాజోలు బస్ కాంప్లెక్సులో ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బస్ కాంప్లెక్సులో ఉన్న యువకుల వద్ద నున్న బ్యాంగులను తనిఖీలు చేశారు. ప్రతీ ప్రయాణికుని వద్దకు వెళ్లి మీరు ఎక్కడి నుంచి వచ్చారు, ఎక్కడికి వెళుతున్నారని అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా రాజోలు సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ భారత్, పాక్ యుద్ధ వాతావరణం దృష్ట్యా, భద్రత కారణాల దృష్ట్యా తనిఖీలు నిర్వహించామన్నారు.



పాఠశాలలో సందడి చేస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

బడిపిల్లలకు ఇక పండుగే

• పాఠశాలల్లో తగ్గనున్న పుస్తకాల మోత • ప్రాథమికోన్నతస్థాయి వరకు లాంగ్వేజీలన్నీ ఒకే బుక్‌లో • 70శాతం మేర చేరుకున్న వైనం

మండపేట, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను ఉత్సాహంతో గడుపుతున్న విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. విద్యార్థులకు 80 నుంచి 90 శాతం మేర ఉండే పాఠ్య పుస్తకాలు టైటిల్స్‌ను 45శాతం మేర తగ్గిం చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో (తెలుగు, ఆంగ్లం, హిందీ) సబ్జెక్టులన్నింటిని ఒకే పుస్తకంగా ఇస్తున్నారు. సెమిస్టర్ విధానంలో అందిస్తుండటంతో పుస్తకాల బ్యాగ్ బరువు తగ్గనుంది. జిల్లా, మండల పరిషత్‌తో పాటు, మున్సిపల్ ఎయిడెడ్, పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు ఆయా ప్రాంతాలకు చేరుకున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మొదటి సెమిస్టర్‌కు వీటిని అందిస్తారు. ఒకటో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులకు ఒకే పాఠ్య పుస్తకం ఇస్తారు. ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించి వర్క్‌బుక్ కూడా ఒకే పుస్తకంలో ఇస్తారు. ఒకటవ తరగతి విద్యార్థులకు కేవలం రెండు పుస్తకాలు మాత్రమే ఉంటాయి. రెండోవ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం, సబ్జెక్టులు ఒక పుస్తకంలో, ఈ మూడు సబ్జెక్టులకు వర్క్‌బుక్ కలిపి మొత్తం రెండు పుస్తకాలు ఉంటాయి. మూడవ తరగతికి తెలుగు, ఇంగ్లీషు ఒక పుస్తకం, గణితం, పరిసరాల విజ్ఞానం, పాఠాలు మరో పుస్తకంలో ఇస్తారు. పాఠ్య పుస్తకాల తరహాలో వర్క్ బుక్ కూడా రెండేసి సబ్జెక్టులకు ఒకటి వంతున వర్క్‌బుక్ ఇస్తారు. నాల్గవ తరగతికి కూడా ఆ తరహాలో రెండేసి సబ్జెక్టులకు ఒక పాఠ్య పుస్తకం, ఒక వర్క్‌బుక్ మొత్తం నాలుగు పుస్తకాలు ఉంటాయి. ఐదో తరగతికి కూడా 3, 4 తరగతుల తరహాలోనే తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఒకటి గణితం, పరిసరాల విజ్ఞానానికి ఒకటి వంతున పాఠ్య పుస్తకాలు మొత్తం నాలుగు ఇస్తారు. 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సబ్జెక్టులకు ఒక పుస్తకం, గణితం, జనరల్ సైన్సు, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు మొత్తం 4 ఇస్తారు. ఎనిమిదో తరగతికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులకు ఒక పుస్తకం గణితం, సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్సు అండ్ బయాలజీ సైన్సు సబ్జెక్టులకు వేర్వేరుగా 4 పుస్తకాలు అందించుతారు. 9వ తరగతికి తెలుగు, హిందీ(పాతది) ఇంగీషులకు ఒక పుస్తకం, గణితం ఒక పుస్తకం, పీఎస్ అండ్ బీఎస్ ఒక పుస్తకం సోషల్ ఒక పుస్తకం, ఇంగ్లీషు, వర్క్ ప్రెసన్స్ బుక్, మొత్తం ఐదు పుస్తకాలు ఇస్తారు. పదో తరగతికి తెలుగు, హిందీ, గణితం, పీఎస్ బీఎస్ జియోగ్రఫీ, హిస్టరీ, డెమొగ్రాఫిక్, అండర్ స్టాండింగ్ వికాస్‌మన్ డెవలప్‌మెంట్ మొత్తం 12 పుస్తకాలు ఇస్తారు.



మండపేటకు చేరిన పాఠ్య పుస్తకాలు